GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 04-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# కలెక్టరేట్ సమీపంలో రాత్రి అయితే... జాతరే...!




## కొంగర ఖుర్దు-ఎ లో మట్టి మాఫియా రెచ్చిపోతోంది.. అధికారులు ఏం చేస్తున్నారు?

- మట్టి మాఫియా ఆగడాలకు అడ్డేది...?
- ప్రభుత్వ భూమలకు రక్షణ ఏది..?
- 277 ఎకరాల్లో యథేచ్ఛగా ఎర్రమట్టి దందా - పోలీసుల కళ్లుగప్పి అక్రమ తరలింపు
- రైతులకు నష్టపరిహారం అందిన, రాత్రి వేళ మట్టిని అమ్ముకుంటున్న వైనం...!
- అక్రమంగా మట్టిని తరలిస్తే వాలెపై కఠిన చర్యలు తీసుకుంటాం – ఆర్ డి ఓ జగదీశ్వర్ రెడ్డి
- నిఘా వ్యవస్థ నిద్రిస్తే... క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది.

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్)**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కు కూతవేటు దూరంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మహేశ్వరం మండలం రావిర్యాల, కొంగర ఖుర్ద్-ఎ లో రాత్రి అయితే చాలు టిప్పర్ల లైట్లతో రోడ్డంతా జాతరను తలపిస్తోంది.అసలేం జరిగింది సంవత్సరం క్రితం టి జి ఐ ఐ సి ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కంపెనీ కోసం సర్వే నంబర్ 287లో సుమారు 277 ఎకరాల భూమిని రైతుల నుండి సేకరించారు. ఎకరాకు కోటి రూపాయలు, 121 గజాల స్థలాన్ని నష్టపరిహారంగా ఇచ్చారు. అయితే నష్టపరిహారం సరిపోలేదని కొంతమంది రైతులు మట్టి మాఫియాతో చేతులు కలిపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.




రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇటాచీలు, జేసీబీలు, టిప్పర్లతో రోజుకు వందల ట్రిప్పుల ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసుల గస్తీని తప్పించుకునేందుకు దొంగదారుల్లో తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. విషయం తెలుసుకున్న కొందరు రైతులు కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆర్డీఓ రావిర్యాల పంచాయతీ కార్యదర్శి అరుణ్ కు ఆదేశాలు జారీ చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని పోలీసులకు అప్పగించాలని ఆదేశించారు.



> **ఆర్డీఓ హెచ్చరిక:**
> ఈ సందర్భంగా ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తున్న ప్రజా ప్రభుత్వం

**రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

- కట్టుకాచారంలో 35 నెలల్లో రూ.13. 50 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు
- రూ.6.65 కోట్లతో నూతనంగా నిర్మించిన చెక్ డాం ప్రారంభం
- రూ. 2.50 కోట్లతో కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంట వాగు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన
- కులమత రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు
- ఎల్నినో పరిస్థితుల్లో చెక్ డాం నిర్మాణంతో రైతులకు ఎంతో ప్రయోజనం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

4లో



# ఆయుధాల చోరీ.. 8 మంది అరెస్ట్

- బొల్లారం మిలిటరీ ఆయుధాల చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 12 ఆయుధాలు, 1,912 బుల్లెట్లు స్వాధీనం
- బ్యాంకులు, జ్యూవెలరీ షాపుల్లో దోపిడీకి కుట్ర
- ఉగ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు లేవు
- విలేకరుల సమావేశంలో సీపీ బి. సుమతి వెల్లడి

2లో



# ఘనంగా ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం.



**ప్రారంభించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి....**

**చెన్నయ్ షాపింగ్ మాల్ లో సినీనటి రితికా నాయక్ సందడి..**





**కోదాడ అక్టోబర్ 03 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది చెన్నయ్ షాపింగ్ మాల్ ను స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ కోదాడ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు అత్యాధునిక మోడల్స్, నాణ్యమైన వస్త్రాలు ఒకే చోట లభించేలా ది చెన్నై షాపింగ్ మాల్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు ప్రముఖ సినీనటి రితిక నాయక్ ప్రత్యేక అతిథిగా హాజరై సందడి చేశారు. మాల్‌లోని పలు విభాగాలను సందర్శించిన రితిక , నూతన వస్త్ర శ్రేణిని, డిజైన్‌లను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం వేదికపై పాటలకు సరదాగా స్టెప్పులు వేసి అక్కడున్న యువతలో ఎనలేని జోష్ నింపారు. సినీనటిని చూడటానికి, సెల్ఫీలు దిగడానికి అభిమానులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాల్ యాజమాన్యం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి, నటి రితిక నాయక్ ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నెని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, స్థానిక కౌన్సిలర్ కోల్లా కోటిరెడ్డి, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, షాపింగ్ మాల్ నిర్వాహకులు మర్రి వెంకటరెడ్డి పట్టణ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## రామప్ప దేవాలయం ను సందర్శించిన గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వి. పి. గౌతమ్ ఐఏఎస్

**వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 03:** మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి. పి. గౌతమ్ ఐఏఎస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. రామప్ప చెరువు ను సందర్శించారు. వారి వెంట ఎంపిడివో రాజు, ఎంఈవో ప్రభాకర్, సర్పంచ్ చలగోండ రాజు ఈవో ఇమ్మడి భాస్కర్, ఆర్ ఐ రమేష్, పంచాయతీ కార్యదర్శి రేవతి, టూరిస్ట్ పోలీసులు, శ్రీకాంత్, బద్రు, శ్రీనివాస్, అరుణ్, రెవిన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆయుధాల చోరీ.. 8 మంది అరెస్ట్

**( క్రైమ్ మిర్రర్): మారేడ్‌పల్లి, అక్టోబర్ 3:** బొల్లారం మిలిటరీ ఏరియాలో జరిగిన అత్యాధు నిక ఆయుధాల చోరీ కేసును మల్కాజిగిరి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మాజీ హవిల్దార్‌తో పాటు అంతరాష్ట్ర ముఠాకు చెందిన మొత్తం 8మంది నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైన 12 ఆయుధాలు, 1,912 బుల్లెట్లును స్వాధీనం చేసుకున్నారు. చోరీకి సహకరించినవారు, ఆయుధాలను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చునున్నవారు, సాయుధ దోపిడీలకు పథకం వేసిన వారి పాత్రలను దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బి. సుమతి శనివారం సికింద్రాబాద్‌లోని మల్కాజిగిరి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఉప్పుతోళ్ల మల్లేష్ అలియాస్ రాజు (37) గతంలో మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో హవిల్దార్‌గా పని చేసి పదవీ విరమణ పొందాడు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు భారీ దోపిడీలకు ప్రణాళిక రూపొందించాడు. గతంలో తనతో పని చేసిన కొండూరి శేషులు, వినోద్‌కుమార్, కుచరకంటి ప్రవీణ్ సహకారంతో ఆగస్టు 31న బొల్లారం మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్ ఆయుధాగారం, మందుగుండు సామగ్రి నిల్వ గది తాళాలు పగులగొట్టి అత్యాధునిక ఆయుధాలను చోరీ చేశారు. ఆగస్టు 31న ఉదయం 7.50 గంటలకు చోరీ జరిగినట్లు గుర్తించిన సైనిక అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో బొల్లారం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మల్కాజిగిరి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. గతనెల 11న అందిన సమాచారం ఆధారంగా ప్రధాన నిందితుడు మల్లేష్‌ను అచ్చంపేటలో అదుపులోకి తీసుకొని , చోరీ చేసిన ఆయుధాలను అచ్చంపేట లోని తన తండ్రి ఇంట్లో దాచిపెట్టిన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### రూ. లక్షల్లో ఆయుధాల కొనుగోలు ఒప్పందం

ప్రధాన నిందితుడిని గతనెల 22 నుంచి ఈనెల1 వరకు పది రోజుల పాటు పోలీసు కస్టడీలో విచారించడంతో చోరీ వెనుక ఉన్న కుట్ర వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆయుధాల వ్యాపారులు అవిడే అలియాస్ ఓబి, బీర్బల్ షా చోరీ చేసిన ఆయుధాలను కొనుగోలు చేసేందుకు అంగీరించినట్లు విచారణలో వెల్లడైనట్లు సీపీ సుమతి తెలిపారు. ఒక్కో పిస్టల్‌కు రూ. 3 లక్షలు, ఒక్కో రైఫిల్‌కు రూ. 5లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆయుధాల కొనుగోలుకు సహకరించిన ఇద్దరితో పాటు స్థానికంగా సాయుధ దోపిడీలకు పథకం వేసిన మల్లికార్జున్, నిరంజన్‌లను కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మల్లికార్జున్, నిరంజన్‌లతో కలిసి బ్యాంకులు, నగల దుకాణాలు, సంపన్నులను లక్ష్యంగా చేసుకొని సాయుధ దోపిడీలకు పాల్పడడానికి ప్రధాన నిందితుడు మల్లేష్ పథకం వేశాడు. గతంలో మల్లేష్ పై అచ్చంపేట, అమ్రాబాద్ పోలీసు స్టేషన్‌లలో చోరీ కేసులు నమోదయ్యాయని, అవిడే పై పశ్చిమ బెంగాల్ లో ఆయుధాల చట్టం కింద కేసు పెండింగ్ లో ఉందని తెలిపారు. ఈ ముఠాకు ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మల్లేష్‌ను ఇప్పటికే జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించగా, మిగిలిన ఏడుగురిని నిందితులను శనివారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు సీపీ సుమతి వెల్లడించారు.

### భారీ ఆయుధాలు స్వాధీనం..

నిందితుల నుంచి నాలుగు ఏకే-203 రైఫిళ్లు, ఐదు మ్యాగజైన్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, మూడు మ్యాగజైన్లు, ఆరు 9 ఎంఎం పిస్టళ్లు, 1,156 పిస్టల్ బుల్లెట్లు, 720 ఏకే-203 బుల్లెట్లు, 36 ఇన్సాస్ బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. మొత్తం 1,912 బుల్లెట్లును, 5 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. 2022లో బారక్‌పూర్‌లో పని చేస్తున్న సమయంలో కొనుగోలు చేసిన నాటు తుపాకీని కూడా మల్లేష్ ఇంటి నుంచి పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. ఆయుధాల చోరీ కేసును ఛేదించడంలో ప్రత్యేక బృందాలు సమన్వయంతో పని చేశాయని తెలిపారు.



## అక్టోబర్ 16న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** యస్ఆర్ బిజి యన్ ఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఈనెల 16న కళాశాల సమావేశం హాలులో నిర్వహించాలని యస్ఆర్ బిజియన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం తీర్మానించింది. సమావేశంవివరాలు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నల్లమోతు తిరుమల రావు, వి ఆనంద్ కుమార్ లు పత్రిక లకు వెల్లడించారు. ఈనెల16 శుక్రవారం రోజున ఉదయం 10గంటలనుండి సాయంత్రం 5గంటల వరకు పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వ హించబడుతుందని వారు తెలిపారు.ప్రముఖ స్థానాల్లో ఉండి ప్రతిభ కనబర్చిన కళాశాల పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు 16మంది ప్రముఖులను ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాజకీయం, జర్నలిజం, సామాజికం,వ్యాపారం,న్యాయం విధానం, ఉద్యమాలు, వైద్యరంగం, విద్యా రంగం లలో రాణించిన పలువురు పూర్వ విద్యార్థులకు సన్మానం కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఏటా ఈకార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది.అదేవిధంగాపూర్వ విద్యార్థుల కార్యవర్గం గతసమావేశం నుండి ఇప్పటివరకు మరణించిన పూర్వ విద్యార్థులు కుటుంబానికి బస్వనారాయణ, రాయల చంద్రశేఖర్, చల్లా శంకర్, చావా శ్రీహరి, ఇల్లూరి సైదులుతదితరులకు సమావేశం నివాళులు అర్పించి సంతాపం ప్రకటించింది. ఈ అపూర్వ సమ్మేళనంకు కళాశాల పూర్వ విద్యార్థులు అందరూ హాజరుకావాలని సమావేశం కోరింది. ఈసమావేశంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మణిభూషనాచారి, ఇదేంటి శ్రీనివాస్, చిన నర్సయ్య,దగ్గులు మాధవరెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ డ్రైనేజీపై అధికారుల నిర్లక్ష్యం..
## కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలి....

**గుండె గణేష్ ముదిరాజ్...**

**క్రైమ్ మిర్రర్ మియాపూర్:** మక్త మహబూబ్‌పేట్ 241 డివిజన్ పరిధిలోని స్మశాన వాటిక వద్ద ఓపెన్ డ్రైనేజీతో మురుగునీరు బహిరంగంగా ప్రవహిస్తూ దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్ విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, శాశ్వత పైపులైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట శ్రీనివాస్, సారా రాము, గంగారం మల్లేష్, గుండె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# దళిత మహిళపై దాడి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు!

**సంఘాల డబ్బుల వ్యవహారంలో వివాదం**

**బహిరంగంగా దుర్భాషలు, దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు**

**చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు విచారణ..**

**చింతపల్లి(క్రైమ్ మిర్రర్):** సంఘాలకు సంబంధించిన డబ్బుల వ్యవహారంలో, తలెత్తిన వివాదం దళిత మహిళపై దాడి కేసు నమోదయ్యే వరకు వెళ్లింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన, వీవోఏ గనిపల్లి మాధవిపై దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు చింతపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంతో పాటు, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా కుప్పల అమర్‌నాథ్ పేరును పేర్కొన్నారు. ఈ ఘటన అక్టోబర్ 2న మధ్యాహ్నం జరిగినట్లు, అదే రోజు సాయంత్రం బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

**సంఘాల డబ్బుల వ్యవహారమే వివాదానికి కారణమా?**

పీకే మల్లేపల్లి గ్రామ పంచాయతీలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న మాధవిపై, సంఘాలకు సంబంధించిన డబ్బుల విషయంలో కొందరు ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తనపై వచ్చిన ఆరోపణలపై గ్రామపంచాయతీ వద్ద మాధవి ప్రశ్నిస్తుండగా, అదే గ్రామానికి చెందిన కుప్పల అమర్‌నాథ్ తన పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడి దాడికి పాల్పడినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ద్వారా తెలుస్తోంది. అయితే డబ్బుల వ్యవహారంపై అసలు వివాదం ఏమిటి? ఆ ఆరోపణలకు ఆధారాలున్నాయా? ఘటనకు దారితీసిన పూర్తి పరిస్థితులు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. బాధితురాలి ఫిర్యాదుపై చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 172/2026గా కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని 74, 115(2), 352 సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టంలోని



3(1)(ఆర్), 3(1)(ఎస్), 3(2)(విఏ) సెక్షన్లను పోలీసులు నమోదు చేశారు. గ్రామస్థాయిలో సంఘాల ఆర్థిక వ్యవహారాలపై ఆరోపణలు తలెత్తినప్పుడు, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి రికార్డుల ఆధారంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యత వహించాల్సిన వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకునే మార్గాలు ఉన్నాయి. అదే సమయంలో ఆరోపణలను ప్రశ్నించిన వ్యక్తిపై బహిరంగంగా దుర్భాషలు, దాడి జరిగిందన్న ఫిర్యాదు రావడం గ్రామీణ స్థాయిలో నెలకొన్న వివాదాలు ఏ స్థాయికి దారితీస్తున్నాయో చూపిస్తోంది. మహిళ గౌరవానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దాడికి సంబంధించిన వీడియో, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఈ దాడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యక్తుల వల్ల ప్రమాదం ఉందని, సదరు మహిళా గతంలోనే ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఈ దాడిపై దేవరకొండ డిఎస్పీ ఏ విధమైన విచారణ, చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి..

# పరిశుభ్రతతోనే రక్షణ.. ఉత్పాదకత!

**స్వచ్ఛ భారత్‌లో సింగరేణి భాగస్వామ్యం కావాలి**

**మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు**

**'స్పెషల్ క్యాంపెయిన్ - 6' ఘనంగా ప్రారంభం**

**మందమర్రి, అక్టోబర్ 3 (క్రైమ్ మిర్రర్):** పరిశుభ్రమైన వాతావరణంలోనే ఉద్యోగుల రక్షణ, మెరుగైన ఉత్పాదకత సాధ్యమవుతాయని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పేర్కొన్నారు. గాంధీజీ కలలు కనిన స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో శనివారం "స్పెషల్ క్యాంపెయిన్ - 6" స్వచ్ఛ-స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. గాంధీజీ కేవలం రాజకీయ స్వాతంత్ర్యాన్నే కాకుండా పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో 'స్వచ్ఛ తెలంగాణ' లక్ష్యాన్ని సాధిస్తూ, స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పరిసరాల అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలి ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి ఇల్లు, పరిసరాలు, పని చేసే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మనం పాటించే ఈ పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.కార్యాలయాలు, గనులు,పని ప్రాంతాలలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరుతో పాటు ఉత్పాదకత పెరుగుతుందన్నారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను నిత్యకృత్యంగా మలుచుకుని, స్వచ్ఛమైన వాతావరణంలో "రక్షణతో కూడిన ఉత్పత్తి" సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం హాజరైన అధికారులు, ఉద్యోగులతో ఆయన స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, పర్యావరణ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పీఓ ఎం. కార్తీక్, ఏఐటీయూసీ జీఎం ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణ, జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతికతో పాటు పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తున్న ప్రజా ప్రభుత్వం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.6.65 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ చెక్‌డ్యామ్‌తో కట్టుకాచారం, కొత్తగూడెం, పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం ద్వారా రవాణా సౌకర్యం మెరుగుపడి రైతులతోపాటు ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. రాయగూడెం నుంచి తక్కెళ్లపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, కట్టుకాచారం గ్రామ అంతర్గత రోడ్లకు రూ.52 లక్షలు, విద్యుత్ లైన్ల మార్పిడికి రూ.7.50 లక్షలు, తాగునీటి వసతుల కోసం రూ.3.50 లక్షలు, అంగన్‌వాడీ భవనం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కట్టుకాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 35 నెలల్లో సుమారు రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని మంత్రి అన్నారు. ఈ పరిస్థితుల్లో కట్టుకాచారం వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తవడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. చెక్ డ్యామ్ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడుతుందని అన్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణంతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తాగునీటి సమస్య కూడా ఏర్పడుతోందని, ఎల్‌నినో ప్రభావంతో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి కూడా సవాలుగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణను ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడేలా ముందుకు తీసుకెళ్లేందుకు విద్యుత్ ఎంతో అవసరమని మంత్రి అన్నారు. సౌర, తదితర ప్రత్యామ్నాయ వనరుల నుంచి విద్యుత్‌ను సమకూర్చుకునేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను వారి ఇంటి వద్దకే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలకు మద్దతు ఇచ్చే అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రెండవ విడతలో సుమారు 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.

### చెక్‌డ్యామ్ నిర్మాణంతో 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కట్టుకాచారం వద్ద నూతన చెక్ డాం నిర్మాణంతో 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇటీవల సమీప గ్రామంలో పర్యటించిన సమయంలో చెక్‌డ్యామ్ వల్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నట్లు గమనించామని అన్నారు. ఈ చెక్‌డ్యామ్‌తో భూగర్భ జలాలు కూడా మెరుగుపడతాయని, గ్రామంలో త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా నీటి లభ్యత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రూ.6.65 కోట్ల వ్యయంతో చేపట్టిన చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ఈ చెక్‌డ్యామ్ రైతులకు, గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని అప్పలనరసింహపురం గ్రామంలో మరణించిన బాధిత రైతు కుటుంబాన్ని మంత్రి మంత్రి పరామర్శించి ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వాసంతి, ఎస్‌ఈ ఎం వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్‌ఈ వెంకట్ రెడ్డి, ఆర్‌అండ్ బి ఎస్‌ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ సైదులు, ఎంపీడీవో ఎం ఎర్రయ్య, తహసిల్దార్ రాంప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నాయకులు నెల్లూరి భద్రయ్య, మామిడి వెంకన్న, రాయపూడి నవీన్, బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, దోసపాటి చంద్రశేఖర్, కొమ్మూరి నరేష్, కడియాల నరేష్, సర్పంచులు రాయపూడి రామారావు, కుక్కల నరేష్, కట్టెకోల నాగార్జున, బోయిన వేణు, భూక్య మౌనిక, కొత్తపల్లి త్రివేణి, అశోక్ రాణి, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడండి



**41/13 లో రెండు ఎకరాల ఐదు గుంటలు...**

**కానా మేట్ భూములను సర్వే చేయండి.. అధికారులు స్పందించకుంటే ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడి చేస్తాం...**

**పానుగంటి పర్వతాలు, సీపీఐ రాష్ట్ర సమితి..**

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి మండల పరిధి కానా మేట్ సర్వే నంబర్ 41/13 లో ఉన్న రెండు ఎకరాల ఐదు గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేయాలని సీపీఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ కమిటీ డిమాండ్ చేసింది. సుమారు రూ. 300 కోట్ల విలువైన ఈ భూమిలో అక్రమంగా వేసిన రేకుల షెడ్లను తొలగించి, ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీసు నిఘా ఉంచేలా ఎమ్మార్వో తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరింది. కానా మేట్ లోని ప్రభుత్వ భూములన్నింటినీ సర్వే చేసి ఎవరు ఎంత భూమి కబ్జా చేశారు, ఎంత భూమి మిగులు ఉంది అనే దానిపై సమగ్ర విచారణ జరిపి హైడ్రా సహకారంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూములను కాపాడాలని, కబ్జాలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సీపీఐ కార్యకర్తలతో పెద్ద ఎత్తున ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, టి. రామకృష్ణ, కే. చందు యాదవ్, శేరిలింగంపల్లి మండల సీపీఐ కార్యదర్శి కే. వెంకటస్వామి, డీహెచ్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నారాయణ, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 204వ అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహణ...




**క్రైమ్ మిర్రర్ చందానగర్:** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఈరోజు 204వ వారానికి చేరుకుంది. చందానగర్, గంగారం లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఈ 204వ అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ స్వయంగా పాల్గొని, నిరుపేదలకు, వృద్ధులకు, వికలాంగులకు స్వయంగా వడ్డించారు. దాదాపు 3200 మందికి పైగా భోజనం అందించడం విశేషం. ఈ సందర్భంగా చైర్మన్ కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ “2019 లో మొదలైన మా ఈ అన్నదాన ప్రయాణం నేడు 204వ వారానికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆకలితో ఎవరూ నిద్రపోకూడదు అనే లక్ష్యంతో ప్రతి శనివారం తప్పకుండా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 3200 మందికి అన్నం పెట్టగలగడం మా అదృష్టం. సేవే మన ధర్మం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడే దండేపల్లిలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

**హాజరుకావాలని జిల్లా అధ్యక్షుడు రామిడి కుమార్ విజ్ఞప్తి**



**మంచిర్యాల అక్టోబర్ 3 (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి తెలంగాణ ఉద్యమకారుల ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రామిడి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, రాష్ట్ర కార్యదర్శి గోపతి రాజన్న హాజరుకానున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు, వివిధ సంక్షేమ అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కావున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, నాయకులు అందరూ ఈ సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని రామిడి కుమార్ విజ్ఞప్తి చేశారు..

# ఆమనగల్లు అభివృద్ధికి పెద్దపీట

**రూ.75 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి శంకుస్థాపన**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలోని వెంట తండాలో రూ.75 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తామని తెలిపారు. తదుపరి ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న షట్టర్లను పరిశీలించి, ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు తల్లోజు ఆచారి, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఓట్ చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ నీ వెంటనే అరెస్ట్ చేసి తొలగించాలి.

**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "సర్" ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి.**

**వామపక్ష విద్యార్థి,యువజన సంఘాల నేతల డిమాండ్.**

**ఇండియా కూటమి,ప్రత్యమ్నయ పౌర సమూహం(సి.సి.ఏ) ఆధ్వర్యంలో అక్టోబర్ 8న ఖమ్మంలో వేలాది మందితో జరిగే ప్రజా ప్రదర్శనకు తరలిరండి.**

**వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ.**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** దేశంలో "సర్" పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, మోడీ ప్రభుత్వం ఓట్ల చోరికి పాల్పడుతుందని, ప్రధానంగా యువత ఓట్లను తోలగిస్తున్న ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞనేష్ కుమార్ నీ వెంటనే అరెస్ట్ చేసి తొలగించాలనీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "సర్" ప్రక్రియను వెంటనే నిలిపివేయాలనీ ఏ.ఐ.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ, ఏ.ఐ.వై.ఎఫ్, పి.డి. ఎస్.యు, పి.డి.ఎస్.యు నాయకులు ఇటికల.రామకృష్ణ, తుడుం.ప్రవీణ్, చింతల.రమేష్, గోకినేపల్లి.మస్తాన్, లక్ష్మణ్ లు డిమాండ్ చేశారు. ఇండియా కూటమి, ప్రత్యమ్నయ పౌర సమూహం(సి.సి.ఏ) ఆధ్వర్యంలో అక్టోబర్ 8న ఖమ్మంలో వేలాది మందితో జరిగే ప్రజా ప్రదర్శనలో పాల్గొనాలని స్థానిక యూనివర్సిటీ పీజీ కాలేజీలో ఏ.ఐ.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ, ఏ.ఐ.వై.ఎఫ్, పి.డి. ఎస్.యు, పి.డి.ఎస్.యు వామపక్ష విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జెన్ జీ యువత దేశ వ్యాప్తంగా పోరాడుతున్నారని, వారిపైపోలీసులతో దాడులు చేపిస్తూ నిర్బంధంఖండని ప్రయోగిస్తూ సర్ పేరుతో వారి ఓట్లను సైతం తొలగించడం ప్రజాస్వామిని ఖూనీ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఒక స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీ, మోడీ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞనేష్ కుమార్ నీ ఏజెంట్ పెట్టుకొని దేశ వ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించి ఓట్ల దొంగతనంకి పాల్పడుతున్నారని వారు తెలిపారు.వెంటనే దేశంలో "సర్" పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, మోడీ ప్రభుత్వం ఓట్ల చోరికి పాల్పడుతుందని, ప్రధానంగా యువత ఓట్లను తోలగిస్తున్న ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞనేష్ కుమార్ నీ వెంటనే అరెస్ట్ చేసి తొలగించాలనీ,కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "సర్" ప్రక్రియను వెంటనే నిలిపివేయాలనీ వారు డిమాండ్ చేశారు.ఇండియా కూటమి, ప్రత్యమ్నయ పౌర సమూహం(సి.సి.ఏ) ఆధ్వర్యంలో అక్టోబర్ 8న ఖమ్మంలో వేలాది మందితో జరిగే ప్రజా ప్రదర్శనలో విద్యార్థులు, యువత వేలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా అద్యక్ష, కార్యదర్శులు మడుపల్లి.లక్ష్మణ్, బుర్ర.మనోజ్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు వంకాయల.రాజుూణూఖ. జిల్లా అధ్యక్షులు జి మస్తాన్, ఏ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర కాన్సిల్ సభ్యులు బొప్పి.ఉమా, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల జిల్లా నాయకులు త్రినాథ్, చిర.కృష్ణప్రసాద్,గాంధీ, శ్రీకాంత్ సాగర్ సమీర్ మహేష్, విశ్వంతు వెంకటేష్, కార్తీక్ రెడ్డి, సుమన్, చరణ్, రెడ్డిబోయిన.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**రికార్డుల పరిశీలన.. వైద్య సిబ్బందికి కీలక సూచనలు**

**నూతన సీహెచ్‌సీ భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. దామోదర రాజనర్సింహ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణ కుమారి శనివారం ఆమనగల్లు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు..ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించిన డీఎంహెచ్ఓ.. డ్రాయింగ్ ఆఫీసర్ మైమున, వైద్యాధికారి ఊర్మిళ, హెచ్ఈఓ తిరుపతి రెడ్డి, పీహెచ్ఎన్, హెడ్ నర్స్ ఏసుమని, ఫార్మసిస్ట్ ఇందిర తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు నమోదైన విషజ్వరాల కేసులు, రోగులకు అందించిన చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్సీ, హైరిస్క్, ఏఎన్సీ చెకప్, ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్, టీబీ, లెప్రసీ, ఈ-ఆరోగ్యం, ఎన్సీడీ, హెచ్‌పీవీ వ్యాక్సిన్, ఎంసీహెచ్, ఓపీ, ఐపీ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణీలకు అందుతున్న సేవలు, కుక్క, పాము, కోతి కాట్లకు సంబంధించిన వ్యాక్సిన్ల నిల్వలను కూడా తనిఖీ చేశారు. గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ట్రామా కేర్, ప్రసవాలు, ఎంసీహెచ్ సేవలు, ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర చికిత్స అందించడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, శ్వాసకోశ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**నూతన సీహెచ్‌సీ భవనాన్ని త్వరగా అందుబాటులోకి తేవాలి....**

అనంతరం ఆమనగల్లు నూతన సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను వైద్యాధికారి మైమున, వైద్య సిబ్బందితో కలిసి డీఎంహెచ్ఓ పరిశీలించారు. మరో నెల నుంచి రెండు నెలల్లోగా భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అసంపూర్తి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డా. స్వర్ణ కుమారి తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో మెడికల్ ఆఫీసర్ డా. మైమున, హెడ్ నర్స్ ఏసుమని, ఫార్మసిస్ట్ ఇందిరా, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్లు దేవేందర్, మధు, రేణుక, వైద్య సిబ్బంది శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ కులగణన సాధనకు అక్టోబర్ 4న 'ఓబీసీ సింహగర్జన'

**శంషాబాద్ సభను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలనే డిమాండ్‌తో అక్టోబర్ 4న శంషాబాద్‌లోని గొల్లపల్లి రోడ్డులో నిర్వహించనున్న 'ఓబీసీ సింహగర్జన' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఏఐసీసీ పిలుపు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు టీపీసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షులు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ ముదిరాజ్, డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగూరి వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర విభజన సేవా సంఘం అధ్యక్షులు హనుమాన్ నాయక్ తదితరులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఓబీసీల జనాభా గణన ద్వారా వారి జనాభాకు అనుగుణంగా హక్కులు, అవకాశాలపై విధానపరమైన నిర్ణయాలకు అవసరమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఓబీసీ కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శంషాబాద్‌లో నిర్వహిస్తున్న సభకు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీసీల హక్కుల సాధనకు సంఘీభావం తెలిపేలా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతుగంటి శంకర్, కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, కంబాలపల్లి రామకృష్ణ, మాల మల్లేష్, గౌడ్ బాల్రాజ్, జగన్ గౌడ్, శేఖర్ గౌడ్, రామచంద్ర నాయక్, అశోక్, జాంగీర్ బాబా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊర్కొండ దర్గాలో డీఎన్ఆర్ ప్రత్యేక ప్రార్థనలు

**ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ద్యాప నిఖిల్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఊరుకొండ):** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి – జడ్చర్ల ప్రధాన రహదారిపై వెలసిన హజరత్ సయ్యద్ ఖాజా యూసుఫోద్దీన్ మిర్జాయి చిష్తీ ఖలందరి దర్గాలో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ వర్కింగ్ అధ్యక్షుడు ద్యాప నిఖిల్ రెడ్డి (డీఎన్ఆర్) పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ద్యాప నిఖిల్ రెడ్డిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి పాలకమండలి చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్, నర్సంపల్లి సర్పంచ్ శైలజ శ్రీశైలం, యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నాదర్‌గుల్‌లో అక్రమ సర్వేపై ప్లాట్ల యజమానుల ఆగ్రహం

**నోటీసులు ఇవ్వకుండా ఏడీ సర్వేయర్ సర్వే చేయడం చట్ట విరుద్ధం**

**సర్వే నెం. 806లో 121 నుండి 165 వరకు గల ప్లాట్ల కొనుగోలుదారుల ఆవేదన**

**తప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకాలను రద్దు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి**




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని సర్వే నెం. 806 మరియు దాని పరిసర సర్వే నంబర్లలో ఏడీ సర్వేయర్ ఏకపక్షంగా, చట్ట విరుద్ధంగా సర్వే నిర్వహించారని బాధిత ప్లాట్ల యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నిర్వహించిన ఈ సర్వేను వెంటనే రద్దు చేయాలని నాదర్‌గుల్ లే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి తోట రాంరెడ్డి, ఇతర ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్లు 794, 795, 796, 803, 804, 805, 806, 807లలో ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్లు 121 నుండి 165 వరకు, ప్లాట్ నంబర్ 169లను తాము 1990 నుండి 2005 మధ్య కాలంలో రిజిస్టర్డ్ సేల్ డీడ్ల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. అన్ని అనుమతులతో హద్దులు ఏర్పాటు చేసుకుని, ఇండ్లు, ప్రహరీ గోడలు నిర్మించుకుని దశాబ్దాలుగా ప్రశాంతంగా అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. గడ్డం వెంకట్ రెడ్డి, గడ్డం మన్మోహన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి, ఇప్పటికే లే అవుట్‌గా మారిన సర్వే నెం. 806 భూములకు అక్రమంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందారని ఆరోపించారు. ఈ పాస్ పుస్తకాల ఆధారంగా వారు 121 నుండి 165 వరకు గల ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి తమను బెదిరిస్తున్నారని వాపోయారు. సరిహద్దు ప్లాట్ల యజమానులకు, తాసిల్దార్ కు కనీసం సమాచారం ఇవ్వకుండా, ఏడీ సర్వేయర్ సర్వే చేయడం తీవ్ర అభ్యంతరకరమని, ఇది బాధితుల హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్లాట్ నెం.121 నుండి 165 వరకు నిర్వహించిన ఏడీ సర్వేను వెంటనే రద్దు చేయాలని కోరారు. అదే విధంగా సర్వే నెం. 806పై తప్పుడు పత్రాలతో గడ్డం వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు పొందిన పట్టాదార్ పాస్ పుస్తకంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు తగిన భద్రత కల్పించి, నిలిచిపోయిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను క్లియర్ చేయాలని కోరారు.

# కల్వకుర్తి బీఆర్ఎస్‌లో కులపరమైన వ్యాఖ్యల వివాదం

**యద్మ సత్యం వ్యాఖ్యలపై ఆర్యవైశ్య సంఘం ఆగ్రహం**

**పోలీసులకు ఫిర్యాదు.. అంబేద్కర్ కూడలిలో దిష్టిబొమ్మ దహనం**




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో బీఆర్ఎస్ నేతల మధ్య నెలకొన్న విభేదాలు రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతున్నాయి. తాజాగా మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నేత యద్మ సత్యం చేసినట్లుగా ప్రచారంలో ఉన్న ఓ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయంగానే కాకుండా సామాజికంగానూ కల్వకుర్తిలో చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ నేత, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌ను ఉద్దేశించి యద్మ సత్యం కులపరమైన వ్యాఖ్యలు చేశారని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆరోపించారు. తమ సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరి హైదరాబాద్ చౌరస్తా నుంచి శివాజీ చౌక్ మీదుగా పోలీస్ స్టేషన్కు చేరుకొని ఈ వ్యవహారంపై కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కురుమూర్తికి ఫిర్యాదు చేశారు.

**అంబేద్కర్ కూడలిలో నిరసన...**

పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు అంబేద్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యద్మ సత్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. కులాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను ఉద్దేశించి కూడా వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆరోపించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా, కులాల పరంగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

**పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం...**

యద్మ సత్యం చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేస్తామని ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఆర్యవైశ్యులపై చేసిన వ్యాఖ్యలకు యద్మ సత్యం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పే వరకు, పార్టీ పరంగా చర్యలు తీసుకునే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కులాలు, సామాజిక వర్గాల మధ్య ఐక్యతకు భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయకుండా రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని వారు కోరారు. ఈ అంశంపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, చట్టపరంగా తప్పు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం నేపథ్యంలో కల్వకుర్తి బీఆర్ఎస్‌లోని అంతర్గత రాజకీయ పరిణామాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంభాషణలపై సంబంధిత వ్యక్తుల అధికారిక స్పందనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## గోవా గవర్నర్‌ను కలిసిన బీజేపీ యువనాయకుడు బొల్గం దివాకర్ గౌడ్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి :** గోవాలోని రాజ్‌భవన్‌లో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును బీజేపీ యువనాయకుడు బొల్గం దివాకర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సేవ, పాలనకు సంబంధించిన పలు అంశాలపై గవర్నర్‌తో సంభాషించారు. ప్రజా సేవ, అభివృద్ధి అంశాలపై గవర్నర్ అశోక్ గజపతి రాజుకు ఉన్న దృక్పథాలను తెలుసుకోవడం ఎంతో జ్ఞానయుతమైన అనుభవంగా నిలిచిందని దివాకర్ గౌడ్ తెలిపారు. విలువైన సమయాన్ని కేటాయించి ఆత్మీయంగా ఆతిథ్యం అందించిన గవర్నర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్‌తో జరిగిన ఈ భేటీ తనకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని బొల్గం దివాకర్ గౌడ్ పేర్కొన్నారు.

## కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టుకు చిట్యాల విద్యార్థినులు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** అండర్--14 బాలక ల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిట్యాల దాగూర్ విద్యాలయం విద్యార్థినులు పి. ఐశ్వర్య, చి. అక్షర నల్లగొండ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సంపాదించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, చిట్యాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యాలయం కరస్పాండెంట్ పెద్ది నరేందర్, పీఈటీ లింగస్వామితో పాటు ఉపాధ్యాయ బృందం పి. ఐశ్వర్య, సి హెచ్ అక్షరలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# ‘తొలిముద్ద’ తో చిన్నారులకు పౌష్టికాహారం

**అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** చిన్నారుల ఎదుగుదలకు తొలిదశ నుంచే పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకం ‘తొలిముద్ద’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అల్పాహార (‘తొలిముద్ద’)కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు అల్పాహారాన్ని మంత్రి జూపల్లి స్వయంగా తినిపించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరేళ్ళ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. అక్టోబరు 1 నుంచి నాగర్‌కర్నూల్‌తో పాటు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో తొలిదశలో ‘తొలిముద్ద’ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. పౌష్టికాహారంతో పాటు ప్రీ-స్కూల్ విద్య అందించడం ద్వారా చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.



**ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం...**

అంగన్‌వాడీ కేంద్రాల్లో ‘తొలిముద్ద’ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

# హయత్‌నగర్‌లో రెండు రోడ్డు ప్రమాదాలు.. ఇద్దరు మృతి

**వేర్వేరు ఘటనల్లో వృద్ధుల దుర్మరణం.. ఒకరిని ఢీకొట్టిన బైక్, మరొకరిని ఢీకొట్టిన గుర్తుతెలియని కారు**

**ఎల్బీనగర్, అక్టోబర్ 03 క్రైమ్ మిర్రర్:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. ఒక ఘటనలో కాలినడకన వెళ్తున్న 62 ఏళ్ల వ్యక్తిని గుర్తుతెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టగా, మరో ఘటనలో రోడ్డు దాటుతున్న 66 ఏళ్ల వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతోపాటు, రోడ్డుపై పడిన అతడిపై నుంచి మరో కారు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ రెండుఘటనలపైహయత్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కాలినడకన వెళ్తుండగా కారు ఢీ బాలరాజు మృతి**

హయత్‌నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అక్టోబర్ 2న రాత్రి సుమారు 11.10 గంటలకు ఎన్ హెచ్- 65పై విజయవాడ నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. అయ్యప్ప కాలనీకి చెందిన రెగుచింతల బాలరాజు (62) తన నివాసం నుంచి హయత్‌నగర్ బస్‌స్టేషన్ వైపు కాలినడకన వెళ్తుండగా, పెద్ద అంబర్‌పేట్ వైపు నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో బాలరాజుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు, చెవుల నుంచి రక్తస్రావం కావడంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, ప్రమాదానికి కారణమైన కారుడ్రైవర్‌ను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

**రోడ్డు దాటుతుండగా బైక్ ఢీ.. ఆపై కారు చక్రాల కింద**

మరో ఘటన అక్టోబర్ 2న సాయంత్రం సుమారు 6.30 గంటలకు కృష్ణవేణి హాస్పిటల్ సమీపంలో చోటుచేసుకుంది. న్యూ రాక్‌టౌన్ కాలనీకి చెందిన మేక రవీందర్ రెడ్డి (66) రోడ్డు దాటుతుండగా పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్తున్న హోండా షైన్ నెంబర్ గల (టీ+13దీహా8244) బైక్ అతడిని ఢీ కొట్టింది. దీంతో రవీందర్ రెడ్డి రోడ్డుపై పడిపోయారు.అదే సమయంలోవెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని ఎర్టిగా కారు కూడా వేగంగావచ్చిరోడ్డుపై పడిపోయిన రవీందర్ రెడ్డిపై నుంచి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. సుమారు ఐదు మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనేస్పందించి హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవీందర్ రెడ్డి మృతి చెందారు.

**సీసీ కెమెరాలతో దర్యాప్తు**

రెండు ప్రమాదాలపై హయత్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రమాదాలకు కారణమైన వాహనాల డ్రైవర్లను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా వాహనాలు, డ్రైవర్లను గుర్తించి తదుపరిచట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు.

# నిరుపేద కుటుంబానికి దైద రవీందర్ ఆర్థిక సాయం

**నకిరేకల్ క్రైమ్ మిర్రర్:** కేతేపల్లి మండలం కొర్లపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎడ్ల సైదులు ఇటీవల మృతి చెందగా, శనివారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొన్నారు. సైదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, బీరోలు ఉపేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య, మాజీ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బయ్యా అంజయ్య యాదవ్, ఎడ్ల లింగయ్య, సుజాత, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ మునుగోడుగా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయం : సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్

**గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యం**

**మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనలతో వేగంగా పారిశుధ్య పనులు**

**మార్కెట్ యార్డ్‌లో డ్రైనేజీ పూడికతీత, కంప చెట్ల తొలగింపు**



**మునుగోడు క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 03:** మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య మెరుగుదల మరియు శానిటేషన్ పనులే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్ తెలిపారు. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.గత నెల 29వ తేదీన శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడులోని పలు వార్డుల్లో 'మార్నింగ్ వాక్' నిర్వహించి స్థానిక సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ క్రమంలో 1వ వార్డు పరిధిలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు నిలిచిపోవడం, అలాగే మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో పిచ్చి చెట్లు (కంప) విపరీతంగా పెరగడాన్ని ఆయన గమనించారు. ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,1వ వార్డు సభ్యురాలు పందుల నీత భర్త రాజేష్‌లతో కలిసి ముమ్మరంగా పారిశుధ్య పనులను ప్రారంభించారు. జేసీబీ యంత్రం సహాయంతో మార్కెట్ యార్డ్ వద్ద నిలిచిపోయిన ప్రధాన డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. అదేవిధంగా యార్డ్‌లో పెరిగిన పిచ్చి చెట్లను, కంపను పూర్తిగా తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. మునుగోడును "స్వచ్ఛ మునుగోడు"గా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడైనా పారిశుధ్య లోపాలు లేదా ప్రజారోగ్య సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, వ్యాపారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# సర్పంచ్‌ల మధ్య ఐక్యత ఎక్కడ?

**సమస్యలపై గళమెత్తే సమిష్టి వేదిక కరవు**

**ఉప సర్పంచ్‌లు ముందడుగు..సర్పంచ్‌ల వెనుకడుగు?**

**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** గ్రామ పంచాయతీలకు సారథ్యం వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాల్సిన సర్పంచ్‌ల మధ్య ఐక్యత కనిపించకపోవడంపై మండలంలో చర్చ జరుగుతోంది. మండలంలోని 17 గ్రామాల ఉప సర్పంచ్‌లు తమ సమస్యలపై చర్చించేందుకు ఫోరం ఏర్పాటు చేసుకున్నా.. సర్పంచ్‌లకు మాత్రం అలాంటి సమిష్టి వేదిక లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

**సమస్యలు అనేకం.. గళం మాత్రం ఒక్కొక్కరిది!**

గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్య కార్మికుల సమస్యలు, నిధుల కొరత తదితర సమస్యలు సర్పంచ్‌లను వెంటాడుతున్నాయి. ఒక్కో గ్రామంలో ఒక్కో సమస్యపై సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా.. మండల స్థాయిలో అందరూ కలిసి ఒకే గొంతుకతో సమస్యలను ప్రస్తావించే పరిస్థితి లేకపోవడం గమనార్హం. ఉప సర్పంచ్‌లు ఫోరం ఏర్పాటు చేసుకుని తమ సమస్యలను సమిష్టిగా చర్చించుకుంటున్నప్పుడు.. గ్రామాలకు ప్రథమ పౌరులుగా వ్యవహరించే సర్పంచ్‌లు మాత్రం ఎందుకు ఒక వేదికపైకి రావడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రామాల సమస్యలు, పంచాయతీల పరిపాలన, నిధుల విడుదల, అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమిష్టిగా చర్చించేందుకు సర్పంచ్‌లకు ప్రత్యేక ఫోరం ఉంటే సమస్యల పరిష్కారానికి మరింత బలం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతారా?**




సర్పంచ్‌లు రాజకీయ భేదాలను పక్కనపెట్టి గ్రామాల అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఒక గ్రామ సమస్యగా కాకుండా మండలంలోని అన్ని గ్రామాల సమస్యగా భావించి సమిష్టిగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అంటున్నారు. పార్టీల వారీగా చూసుకుంటే సర్పంచుల ఫోరం ఏర్పాటు కోసం వెంకేపల్లి సర్పంచ్ జయకుమార్, చీల్పకుంట్ల సర్పంచ్ అంజపల్లి నర్సమ్మ మద్దతు ఇరు పార్టీలపై ఉంది. వీరు ఎటు మద్దతు తెలిపితే ఆ పార్టీ సంబంధించిన సర్పంచి మండల ఫోరం కన్వీనర్ గా వ్యవహరించి అవకాశం ఉంది. "ఉప సర్పంచ్‌లకు ఫోరం ఉన్నప్పుడు.. సర్పంచ్‌లకు ఎందుకు ఉండకూడదు?" అనే ప్రశ్నకు సర్పంచ్‌లే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మండలంలోని సర్పంచ్‌లు ఒకే వేదికపైకి వచ్చి తమ సమస్యలు, గ్రామాల అభివృద్ధిపై చర్చించేందుకు కార్యాచరణ రూపొందిస్తారా? లేక ఎవరి గ్రామ సమస్య వారిదే అన్నట్లుగా కొనసాగుతారా? అనేది వేచి చూడాల్సిందే.

## నూతనకల్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులుగా సరిత సుధీర్ రెడ్డి



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఉపర్పంచులు శనివారం మండల కేంద్రంలోని ఉమాదేవి ఫంక్షన్ హాల్ లో సమావేశమై ఉప సర్పంచుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి జిల్లా ఉప సర్పంచ్ లు ఫోరమ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందు యాకయ్య ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది.మండల ఉప సర్పంచ్ ల కమిటీ అధ్యక్షులుగా నాగం సరిత సుధీర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గా గోరంట్ల వెంకన్న,ప్రధాన కార్యదర్శిగా నేనావత్ సురేంద్రనాయక్, కార్యదర్శిగా సామ సురేందర్ రెడ్డి, కోశాధికారిగా గంట నాగమణి,వర్కింగ్ ప్రెసిడెంట్ గా వల్లమల్ల నరేష్, మరికంటి అనసూయ మంగళపల్లి నారాయణ జ్యోతి ధారావత్ వేల్పుల స్వరూప పాల్వాయి నాగరాజ్ దుండుగల భూలక్ష్మి తదితరులు ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులు నాగం సరిత సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ, సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడుతామని తెలిపారు.

## చిట్యాల ఫోటోగ్రాఫర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ యేళ్ల బయ్యన్న ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిష్టాత్మక కళాపురస్కార్ అవార్డును అందుకున్నారు. సాంప్రదాయ ఫోటోగ్రఫీలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ఉత్తమ ట్రెడిషనల్ ఫోటోగ్రాఫర్ అవార్డు లభించింది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఫోటోటె క్, ఎడిట్ పాయింట్ ఇండియా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ ఎక్స్‌పోలో భాగంగా భారత్ కళాపురస్కార్ -26 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలో సాంప్రదాయ ఫోటోగ్రఫీ విభాగంలో యేళ్ల బయ్యన్న ప్రతిభ కనబరిచి ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం అభిమన్యు రెడ్డి, ఇప్పలపల్లి రమేష్ చేతుల మీదుగా యేళ్ల బయ్యన్న అవార్డును అందుకున్నారు. చిట్యాల ప్రాంతానికి చెందిన ఫోటోగ్రాఫర్ జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ వేదికపై అవార్డు అందుకోవడం పట్ల స్థానికులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

## మధుకర్‌కు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్న మధుకర్‌ను బీజేపీ చిట్యాల పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలోని ఆర్గానిక్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరికంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మైల నరసింహ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రవరం లింగస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు మోస శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కూరెళ్ల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, జయారపు రామకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గంజి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక ఆరోగ్యం.. మానసిక ఉల్లాసం.. క్రమశిక్షణ

**చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి: మంత్రి జూపల్లి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని.. క్రీడల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎల్లూరులో క్రీడా మైదానం అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రతిభావంతులైన క్రీడాకారులు మారుమూల ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభను చాటాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం రోజుకు కనీసం ఒక గంట వ్యాయామానికి కేటాయించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా వసతులను మెరుగుపరిచి యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.